క్లుప్తంగా

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధుల నయం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హేమాక్షి

సీతానగరం: దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న రోగులకు ఆయుర్వేద వైద్యం శ్రేయస్కరమని బూర్జ ఆయుష్ వైద్యాధికారిణి టి.హేమాక్షి అన్నారు. మండలంలోని చెల్లంనాయుడువలసలో శనివారం ఉచిత ఆయుష్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 40 మంది రోగులకు తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.అప్పమ్మ, వైద్య సిబ్బంది, ఆశా వర్కరు పాల్గొన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణ



బోరుకు అమర్చుతున్న విద్యుత్ మోటారు

సీతానగరం: మండలంలోని చినబోగిలి మంచి నీటి పథకానికి సంబంధించి విద్యుద్దీకరణ పనులు చేపట్టడంతో నాలుగు రోజులుగా ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కారమైందని పంచాయతీ కార్యదర్శి బి.మనోహర్ అన్నారు. మరమ్మతులకు గురైన వాటర్‌ట్యాంక్ పంప్ హౌస్ మోటారు, వైర్లు కొత్తగా అమర్చి మంచినీరు కుళాయిల ద్వారా సర్పంచ్ కె.రాధ సరఫరా శనివారం ప్రారంభించారు. ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఎరువు దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

బలిజిపేట: బలిజిపేటలోని ఎరువుల దుకాణాలను పాలకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.రత్నకుమారి శనివారం పరిశీలించారు. గలావల్లి, గంగాడ, వంతరాం, బలిజిపేటలలో ఉన్న ఎరువుల దుకాణాలు పరిశీలించారు. షాపులలో రికార్డులు, స్టాక్ వివరాలు సక్రమంగా ఉండాలని సూచించారు. షాపుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని వాటిపై ధరలు రాసి ఉంచాలన్నారు. గలావల్లిలో ఎస్ఆర్ ఫెర్టిలైజర్స్‌కు రూ.2,00,164, గంగాడలో జీఎస్ ట్రేడర్స్‌కు రూ.63,496లకు స్టాప్ సేల్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఎటువంటి ఫిర్యాదులు అందినా వారిపై చర్యలు చేపట్టడం జరుగుతుందని రత్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే సామాజిక తనిఖీలు



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ చంద్రమ్మ

పార్వతీపురం: ఉపాధి హామీ పనులలో మరింత పారదర్శకతను పెంచేందుకే సామాజిక తనిఖీలను నిర్వహిస్తున్నట్లు పీడీ శ్రీహరి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ మీరావలి ఆధ్వర్యంలో బృందం నిర్వహించిన సోషల్ ఆడిట్‌పై అధికారులు సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.శోభారాణి, డీఎల్‌డీఓ చంద్రమ్మ, ఎంపీఓ అకీబ్ జావిద్ తదితరులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు, తదితరులు

పాచిపెంట: మండంలోని రాయిగుడ్డివలస పంచాయతీ పరిధిలో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను డ్వామా పీడీ కె. రామచంద్రరావు శనివారం పరిశీలించారు. పనులు ఏమేరకు పూర్తయ్యాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేతనదారులతో మాట్లాడారు. అలాగే పాంచాలి గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈయన వెంట గ్రామ, వార్డు జిల్లా సమన్వయకర్త చిట్టిబాబు ఏపీఓలు మహేష్, కార్తీక్ ఉన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

- గృహసారథులే కీలకం
- ప్రజలందరి నమ్మకం చూరగొన్న ఏకైక ప్రభుత్వం మనది : డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పార్వతీపురం టౌన్:

అర్హతే ప్రామాణికంగా చేసుకొని ప్రజల ముంగిటికే ప్రభుత్వ సేవలు అందజేస్తున్న ప్రభుత్వం మనదని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. వచ్చే 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పార్టీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు అంతా కలిసి పని చేయాలన్నారు. మండలంలోని వెంకంపేట గ్రామంలో, మున్సిపాలిటీ 10 సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్వర్యంలో శనివారం జరిగిన గృహ సారథులు శిక్షణా కార్యక్రమంలో మఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత చేరువ చేసి పార్టీకి పూర్తి స్థాయిలో ప్రజల నుంచి మద్దతు కూడగట్టి 2024లో గెలుపే లక్ష్యంగా చేసుకుని రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల పరిధిలో ఇటీవల సచివాలయం కన్వీనర్లను ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్ మరో ముందడుగు వేస్తూ ప్రతీ వలంటీర్ పరిధిలో ఇద్దరు గృహ సారథులను నియమించారన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమం ద్వారా గృహ సారథులు అంతా సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు సహాయంతో తమ పరిధిలో గల ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గురించి వారికి వివరించి గత ప్రభుత్వం మోసపర్చిన విధానం, ప్రస్తుత మన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి వారికి వివరించాలన్నారు. వారి అనుమతితో డోర్ స్టికర్, మొబైల్ స్టికర్ అంటించే బాధ్యత మీరంతా తీసుకుని పార్టీని ప్రజల్లోకి మరింత చేరువ చేసేలా చూడాల్సిన బాధ్యత మీతో పాటు మన అందరిపై ఉందన్నారు.

ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ మన పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో 534 మంది గృహసారథులను నియమించడం జరిగిందన్నారు. శనివారం 10వ సచివాలయం ప్రక్కన గల ప్రాంగణంలో బెలగాం ప్రాంతంలో గల 7 వార్డు సచివాలయం పరిధిలో నియామకం కాబడిన గృహ సారథులకు ఇచ్చిన శిక్షణా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. రెండో విడతగా బెలగాం ప్రాంతాలలో గల 7 వార్డు సచివాలయంల కన్వీనర్లు, వలంటీర్లు గృహ సారథులతో కలిసి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించి వారికి భవిష్యత్ కార్యాచరణపై తర్ఫీదు ఇచ్చారు. ఈ నెల 11న నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా ప్రారంభం కానున్న 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమం ద్వారా గృహ సారథులు అంతా సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు సహాయంతో తమ పరిధిలో గల ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథరావు, పూడి శంకర్రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, బోంగు చిట్టిరాజు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జేసీఎస్ కన్వీనర్లు గొర్లి మాధవరావు, బి. వాసుదేవరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డుల కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, పక్కన ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశానికి హాజరైన గృహ సారథులు, వలంటీర్లు

జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం



సాలూరు: మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రతిపక్షాలన్నీ ఒక్కటైనా 2024లో ప్రజల ఆశీస్సులతో జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర జోష్యం చెప్పారు. పట్టణంలోని మెంటాడవీధి కోదండరామ కల్యాణ మంటపంలో వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ ఖ్లోపల్లి త్రినాథ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సమన్వయకర్తలు, గృహసారథులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తమ పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా తెలుసుకుని అర్హులకు పథకాలు అందించాలన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు, లోకేష్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేవన్నారు. గతంలో నమ్మి ఓటేసిన ప్రజలకు మోసం చేసిన చరిత్ర చంద్రబాబుది అయితే.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిదేనని చెప్పారు. ప్రజలకు మేలు చేస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుగుబిల్లి రాములమ్మ, వైఎస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతమ్మ, గ్రంథాలయాల జిల్లా చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైస్ చైర్మన్ బంకురు శ్రీనివాసరావు, నాయకులు దండి శ్రీనివాసరావు, భరత్ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

రూ 5.41 కోట్లతో ఇంటింట కుళాయి పనులు



అండర్ గ్రౌండ్‌లో వేయాల్సిన పైపలను పరిశీలిస్తున్న డీఈ హనుమంతరావు

సీతానగరం: మండలంలో ఇంటింట కుళాయి పనులను నాణ్యత ప్రమాణాలకు లోబడి వేగవంతంగా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు అన్నారు. గెడ్డలుప్పిలో జల్ జీవన్ మిషన్ పథకం నిధులు రూ.39 లక్షలతో చేపడుతున్న ఇంటింట కుళాయి పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవతో మండలంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.5.41కోట్లలో మొదట, రెండో విడతగా 19 గ్రామాల్లో ఇంటింట కుళాయిల నిర్మాణ పనులు మంజూరైనట్టు తెలిపారు. అంటిపేటలో రూ.37 లక్షలు, వెంకటాపురం రూ.19లక్షలు, వీబీపేట రూ.18 లక్షలు, బగ్గందొరవలస రూ.31 లక్షలు, బళ్ళక్రిష్ణాపురం రూ.25 లక్షలు, బూర్జ రూ.27 లక్షలు, చినబోగిలి రూ.24 లక్షలు, గెడ్డలుప్పి రూ.39లక్షలు, గుచ్చిమి రూ.59 లక్షలు, గుచ్చిమి సీతారాంపురం రూ.16 లక్షలు, గాదెలవలస రూ.58 లక్షలు, జోగింపేట రూ.10 లక్షలు, కేఎస్‌పురం రూ.16 లక్షలు, కాశీపేట రూ.37 లక్షలు, లచ్చయ్యపేట రూ.11 లక్షలు, బుడ్డిపేట రూ.24 లక్షలు, అప్పయ్యపేట రూ.31 లక్షలు, రామవరం రూ.27 లక్షలు, రెడ్డివానివలస గ్రామానికి రూ.16 లక్షల వంతున నిధులు మంజూరైనట్లు తెలిపారు. సుజలధార పథకం ద్వారా మరికొన్ని గ్రామాలకు మంచినీటి పథకాలను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గెడ్డలుప్పిలో రూ.39 లక్షల వ్యయంతో చేపడుతున్న ఇంటింట కుళాయిల పథకం ద్వారా 400 ట్యాప్‌లు అమర్చాల్సి ఉందన్నారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఏఈ రావుపల్లి పవన్‌కుమార్, సర్పంచ్ తిరుపతిరావు, ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కె.వెంకయ్య పంచాయతీ కార్యదర్శి మోహనరావు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు పింఛన్ మంజూరు



చిన్నారి తల్లికి పింఛన్ అందచేస్తున్న సర్పంచ్ గవర రాజ్యలక్ష్మి, తదితరులు

కురుపాం: మండలంలోని కిచ్చాడ పంచాయతీ కేంద్రానికి చెందిన రెడ్డి కిశోర్, లలిత దంపతుల ఇద్దరు పిల్లలు రెడ్డి విశాల్, రెడ్డి నిశాల్ సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్నారు. ఇటీవల వారు వైఎస్సార్ పింఛన్ కానుక కోసం దరఖాస్తు చేసుకోగా.. ఈ నెల వారికి పింఛను మంజూరైంది. దీంతో సర్పంచ్ గవర రాజ్యలక్ష్మి, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ చంద్రశేఖర్ శనివారం ఆ ఇద్దరు చిన్నారులకు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛను మొత్తం రూ.10వేలు అందజేశారు. ప్రభుత్వం తమ పిల్లలకు పింఛను మంజూరు చేయడంతో వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పైల సత్యంనాయుడు, గృహసారథి కోట శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యకర అలవాట్లతో క్యాన్సర్ దూరం

గుమ్మలక్ష్మీపురం:

ఆరోగ్యకరమైన అలవాట్లతో క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామయ్య అన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ వి.పెదరామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం గ్రామాల్లో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎల్విన్‌పేట మూడు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. ప్రపంచ వ్యాప్తంగా అధికంగా మరణాలకు కారణమవుతున్న వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటని, సరైన జీవన శైలి, ఆహార అలవాట్లు, రెగ్యులర్ చెకప్‌లు, ముందస్తుగా గుర్తించడం, చికిత్స చేయడం వల్ల క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.

సాయం చేయడంలో 'దొర'

గుమ్మలక్ష్మీపురం: ఎవరైనా చనిపోయాక అంత్యక్రియల అనంతరం దుఃఖంలో ఉన్న ఆ కుటుంబంతో పాటు వారి బంధువులకు ఓ పూట ఉచితంగా భోజనం పెడుతున్న మద్ది దొరబాబు సాయం ఎంతో గొప్పదని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు అన్నారు. శనివారం సుందరయ్య కాలనీకి చెందిన సూర్యారావు మృతి చెందడంతో సర్పంచ్ గౌరీశంకరరావు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆ కుటుంబానికి దొరబాబు సమకూర్చిన భోజనాలను అందించారు. దొరబాబు మాట్లాడుతూ గ్రామంలో కుల, మతాలకు అతీతంగా దుఃఖంలో ఉన్న ప్రతీ కుటుంబానికి భోజనాలు పెడుతున్నానని, భవిష్యత్‌లో కూడా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని అన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు

కొమరాడ: గృహ నిర్మాణాలు వేగవంతం అయ్యేలా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం అమల చేస్తున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులందరికీ పని కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య శిబరాలు ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి జామి నారాయణ స్వామి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర వైద్య పరీక్షలు

బలిజిపేట: పెదపెంకిలో శనివార నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 19మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పెదపెంకి నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్లసంజీవనాయుడు ఆధ్వర్యంలో గ్రంథాలయం వద్ద నిర్వహించిన శిబిరంలో 19మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించగా 13మంది శస్త్ర చికిత్సకు ఎంపికైనట్టు ఆప్తాల్మిక్ కిరణ్ తెలిపారు. కె.శ్రీనివాస్, నాగిరెడ్డి, త్రినాథ్, రాముడు తదితరులు సేవలు అందించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు తనిఖీచేస్తున్న డీఎస్పీ సుభాష్

సాలూరు: పట్టణ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ సుభాష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు పాపారావు, నారాయణరావు, తదితరులు ఉన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

సాలూరు: పట్టణంలోని గాంధీనగర్ -1 సచివాలయ పరిధిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి పీడిక రాజన్నదొర హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా పాల్గొనాలని కోరారు.

మూతబడిన వసతిగృహం పరిశీలన



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న సహాయ సాంఘిక సంక్షేమ అధికారి దుర్గాప్రసాద్

మక్కువ: మండలంలోని శంబరలో గతంలో మూసివేసిన ఎస్సీ బాలుర వసతిగృహాన్ని సహాయ సాంఘిక సంక్షేమ అధికారి (పార్వతీపురం) దుర్గాప్రసాద్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూసివేసిన వసతిగృహాన్ని తిరిగి ప్రాంభించాలని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఇటీవల ప్రభుత్వానికి విన్నవించిన నేపథ్యంలో వసతిగృహాన్ని సందర్శించామన్నారు.

ఎస్‌డీసీ కార్యాలయం ఎల్విన్‌పేటకు తరలించాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురంలో ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయాన్ని గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేటకు (యథాస్థానానికి) తరలించాలని గిరిజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏల ఉపప్రణాళిక మండలాల్లోని షెడ్యూల్ట్ ఏరియా లో 1/70 చట్టం పకడ్బందీగా అమలు చేసి, గిరిజన ప్రాంతాల్లో భూముల రక్షణ కల్పించేందుకు ఎల్విన్‌పేటలో ఏర్పాటు చేసిన ఎస్‌డీసీ కార్యాలయాన్ని మూడేళ్ల కిందట పార్వతీపురానికి తరలించారని, గిరిజనులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాల్సి న ఈ కార్యాలయం ఇప్పుడు గిరిజనులకు దూరమైందన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఎస్‌డీసీ కార్యాలయాన్ని యధావిధిగా గిరిజనులకు అందుబాటులో ఉండే ఎల్విన్‌పేటలో నిర్వహించేలా చొరవ చూపాలని రంజిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

రైతాంగ సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే జోగారావుకు సమస్యలు వివరిస్తున్న రైతులు

పార్వతీపురం టౌన్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో గల సీతానగరం మండలం తామరకండి గ్రామ రైతులు గ్రామ ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే అలజంగి జోగారావుని క్యాంప్ కార్యాలయంలో శనివారం కలిశారు. ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసినప్పటికీ తాము సకాలంలో నూర్పులు చేయలేని కారణంగా వెనుకబడ్డామని, ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే జోగారావు వారి ముందే సివిల్ సప్లై అధికారులతో మాట్లాడారు. గ్రామంలో సిద్ధంగా ఉన్న ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. తగు చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లై డీఎం తెలిపారు. ధాన్యం కొనుగోలుపై తక్షణం స్పందించిన ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఎగిరెడ్డి గౌరీశ్వరి, సర్పంచ్ మూడడ్ల లలిత, వైఎస్సార్ సీపీ నాయకులు మూడడ్ల మన్మధరావు, ఎగిరెడ్డి శ్రీనివాసరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఫేషియల్ హాజరు తప్పనిసరి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా ఫేసియల్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండలంలోని శివ్వాం, కొత్తూరు పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి వారి సామర్థ్యాలను పరిక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మెనూ పక్కాగా అమలు చేయాలని, భోజనం నాణ్యతపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ, తదితరులు

పాలకొండ రూరల్: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించేలా సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని హౌసింగ్ ఏఈ మాధవరావు అన్నారు. శనివారం హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాల్లోని జగనన్న కాలనీల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి అవసరాలపై ఆరా తీశారు. కాలనీలో పూర్తిస్థాయిలో విద్యుత్, తాగునీరు, రోడ్లు, ఇతర సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పనులు చేపడుతున్న వారికి సకాలంలో బిల్లులు చెల్లించడంతో పాటు నిర్మాణ సామగ్రి అందిస్తున్నామన్నారు. ఉగాధి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి, గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని సూచించారు.

కట్టెజనుము సాగు పరిశీలన



కట్టె జనుము సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పాలకొండ రూరల్: మండంలోని పీఆర్.రాజుపేటలో అభ్యుదయ రైతు కండాపు ప్రసదారావు పండిస్తున్న నూతన కట్టెజనుము పంటను శాస్త్రవేత్తలు పరిశీలించారు. విజయనగరం జిల్లా ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు కె. స్వాతి, కె.తేజేశ్వరరావు శనివారం గ్రామానికి చేరుకుని రైతుతో మాట్లాడి పంట సాగుపై ఆరాతీశారు. సదరు రైతు వేసిన సువిన్, ఎస్‌హెచ్-4 రకం కట్టె విత్తనాలను పరిశీలించారు. రెండు నెలల క్రితం అందించిన ఈ విత్తనాలతో అధిక దిగుబడితోపాటు భూమికి మంచి పోషణ లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆసక్తి గల రైతులకు తేనేటీగల పెంపకంపై శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

వీరఘట్టం: మండలంలోని తెట్టంగిలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీమహాలక్ష్మీ పేరంటాల ఆరాధనా మహోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ధర్మకర్త గుజ్జల నారాయణరా వు, జయలక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారి కల్యాణం జరిపించారు. అనంతరం మహాలక్ష్మీ పేరంటాలకు నిత్య హారతి, కుంకుమ పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి, పూజాక్షింతలను తలపై చల్లుకున్నారు. అనంతరం సుమారు 200 మంది పేదలకు ఆలయ ధర్మకర్త నారాయణరావు దంపతులు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. రాత్రి అమ్మవారిని తిరువీధిలో ఊరేగించారు.